కథానిక

# బ్రోకర్ బాబు

భమిడిపాటి రామగోపాలం

సాయంకాలం నాలుగుగంట లవుతుంది. బాబు వాకిట్లో కొచ్చేడు. చిన్ననవ్వు విసురుతూ "ఏం చేస్తున్నారండీ" అన్నాడు.

"నువ్వేమిటిలా అకస్మాత్తుగా దిగేవ్?"

"ఏమీ లేదు లెండి" అని కూచున్నాడు. నెమ్మదిమీద 'సినిమాకెళ్లాలండి'' అన్నాడు. ఆస్వరంలో తనదగ్గిర డబ్బులు లేవని తెలుస్తూంది.

"ఏం చెయ్యమంటావు? డబ్బుల్లేవు!"

"మీ అమ్మగార్నడగరాదూ?"

"దెబ్బలు ముందు పుచ్చుకుందికి సిద్ధమైతే డబ్బు లడగొచ్చు"

"పోనీలెండి యెప్పుడూ యిలాగే."

"నాకు సరిగ్గా సాయంత్రం నాలుగింటి కొచ్చి అప్పటికప్పుడు డబ్బులు కూడదీసి టికెట్ చేసి సినిమా మొదటాటకే పోవాలంటే ఎలా కుదురుతుంది?"

"నే నొకపని చెప్తాను చేస్తారా?"

"ఏమిటది?"

అతను నా చెవిదగ్గిర మొహం పెడుతున్నాడు.

"అక్కర్లేదులే. ఇంట్లో ఎవరూ లేరు గట్టిగా చెప్పు."

"చిన్న బ్రోకరేజి చేద్దామండీ"

బ్రోకరేజి అనగానే నా కర్థమైంది. ఎవరికో బియ్యం కావాలన్నమాట. కొన్ని బియ్యం అమ్మాలి. డబ్బు చేసుకోవాలి. అదీ పని.

"ఎవరితో న్యాయమా? కొంప దీసి...?" అన్నాను, మా వీథిలోనే ఉంటున్న అధికార్లను దృష్టిలో పెట్టుకొని.

"ప్రమాదం లేదు లెండి, రంగమ్మతోనే. పొద్దుట నేను వీథిగుమ్మంలో నించుంటే ఒరే బాబూ, ఇంట్లో బియ్యం అయిపోయినాయి. ఎక్కడైనా ఫిరాయించిపట్రాగలవా అన్నారు. ఇప్పుడు మళ్ళా చెప్పింది, వెంటనే యెక్కడయినా తెచ్చి పెడితేగాని రాత్రి కందరూ పస్తేనని."

"డబ్బిస్తానందా?"

"తెస్తే యెవడికోసమిస్తుంది?"

'సరే ఎన్ని సేర్లు తెద్దాం?"

"ఎన్ని సేర్లో యెరుగనండి? ఒక్క సేరు చాలవూ?"

"ఎలా సరిపోతాయోయ్?"

"సేరు రూపాయి పలుకుతాయి. మనం రూపాయున్నర కమ్మినాం."

"అనుకుంటున్నావు. కాని మనం సినిమా కెళ్ళడమంటే ముప్పావలా కావాలి. నువ్వు సిగరెట్లు మానేస్తే కదా! నేను కాఫీహోటలు బాబూ."

"నేను సిగరెట్లు మానేస్తాను. మీరు హోటలు మానేయండి."

"కుదరదు. ఇంటిదగ్గిర ఇంతవేగం అన్నం దొరకదు. రాత్రి సరిదాకా ఆగలేను. అంచేత నువ్వు సిగరెట్లు కాల్చేది మానేది నీయిష్టం. నేను మాత్రం ఓ అద్దరూపాయి తినందే ఉండలేను."

"అయితే మరెలాగ?"

"రెండు సేర్లు తేవాలి. పెద్ద కాపరానికి ముప్పేమిటి?"

"సరే అయితే పదండి."

"నువ్వెళ్ళరాదూ? సైకిలేసుకుని!"

"నా కిస్తారా వాళ్ళు?"

"మీరొస్తే యిస్తారూ?"

ఇక్కడ ఒక సంగతి చెప్పవలసి ఉంది. ఈ బియ్యం దొరకడం కొత్తపేట అనే మరో వీథి నుంచి. అక్కడ మా వాళ్ళొకళ్ళింట్లో బియ్యం 'దాచుకున్నాం.'

"పోనీ మీరూ రారాదూటండీ, ఇద్దరం కలసి వెళ్ళొద్దాం!"

"ఎంత సేపవుతుందో!"

"సైకిలుందిగా? పదినిమిషాల్లో వచ్చెయ్యం?"

"డబుల్సా?"

"ఏం?"

"నేను మాత్రం తొక్కలేను. చెప్పేస్తున్నాను"

"పోనీ నేను తొక్కుతాను. సరా?"

బట్టలు వేసుకుంటూ ఉంటే మా తమ్ముడొచ్చి "ఎక్కడికిరా?" అన్నాడు. "తకున పక్షి వెళ్తావా? అప్పుడే అడిగావా?" అని ఒక్క తగల్చినాప్పటి నుంచు ఏడుస్తూ కూచున్నాడు.

"ఎక్కడికని అడగడం అపశకునమైతే ఏడవడం అపశకునం కాదుటండీ?" అన్నాడు బాబు.

"వాడు ఏడుస్తాడని తెలిసి వెళ్తానా? ఆ దెబ్బతో పోతాడనుకున్నాను" అన్నాను తల దువ్వుకుంటూ.

"నువ్వెళ్ళి సైకిలు పట్రావోయ్. ముఖం కడుక్కొస్తాను" అన్నాను మళ్ళా.

"ఘనవాతేను దద్దూ! మళ్ళీ యిప్పుడు మొహం కడుక్కోడం దేనికి?" అన్నాడు బాబు.

"బ్రహ్మదేముడొచ్చినా మొహం కడక్కుండా బైటికి రాను. అద్దంలో చూస్కుంటే మంచుకొండలు ఎండకి కరిగి నీళ్ళలా ప్రవహిస్తాయో కన్ని కడుక్కోండి."

బాబు వెళ్ళాడు.

"ఒరే నేనూ రావొద్దురా, సినిమాకి?" అన్నాడు తమ్ముడు.

"ఏడిశావు వెధవ్వి. మేం సినిమాకెళ్తే నా అసలు?"

"పోనీలేరా. ఎప్పుడూ తీసికెళ్ళవు!"

"వెధవా, యివాళ రోజు మొత్తం మీద పుస్తకం తీశావా? పరీక్షలు వారం రోజులు లేవు గాబోలు!" అంటూ కీచు గొంతుతో అన్నాను.

బాబు సైకిలు పట్టుకొచ్చాడు.

సీటుమీద తను కూర్చున్నాడు. నేను వెనక్కి వెళ్ళాను "రైట్?" అన్నాడు నవ్వుతూ. నేను క్యారేజి మీద కూర్చుని "యేస్" అన్నాను. బరువు గ్రహించి బండిలాగాడు.

"మిమ్మల్నింత కష్ట పెట్టక పోదును గాని ఆ ఫిల్ముకి ఇవాళ ఆఖరురోజటండీ!" అన్నాడు.

"పోన్లే, ఇంతోటి కష్టానికేమిటుంది?"

మరి మాటలు జరగడం లేదు. చిన్నగొంతుకతో పాట పాడుకుంటున్నాను. ఒక్కొక్కప్పుడు పదేసిరోజులు టైం ఉండగానే వేసిన సినిమా ప్రోగ్రాములు కూడా ఫెయిలయ్యేవి. ఇవాళ యిప్పుడిప్పుడనుకున్నామో లేదో అప్పుడే ఎగ్జిక్యూట్ చేసి పారేస్తున్నాను.

బియ్యం అమ్మేస్తున్నాం కదా అన్న విచారం కూడా లేదు. ఎందుకంటే మొట్ట మొదటి సంగతి ఆ బియ్యానికి లెక్క పత్రమూ లేవు.

కొత్తపేట వీధిలో మా దూరపు బంధువులు కొందరున్నారు. వాళ్ళు కింపచేసే పొలంలోను ఎక్కడికి డబ్బు మా దగ్గిర తీసుకెళ్ళారు. మేం పత్రం లేకుండానే అప్పిచ్చాం. తిరిగి డబ్బివ్వలేమని మొదట్లే చెప్పారు. సంవత్సరానికి సరిపడే గ్రాసం తీసుకుపొమ్మన్నారు. ప్రొక్యూరుమెంటు వాళ్ళ కంటపడకుండా దాచిన పంట వుంది.

మేం అంతా ఒక్కసారిగా తెచ్చుకోలేదు. కారణం భయం, మా యిల్లు మరీ చిన్నది. దాచుకోడానికి భయం సంకోచంగా చోటు లేదు. అందుచేత అవసరం వచ్చినప్పుడల్లా కొంచెం కొంచెం తెచ్చుకుంటూ ఉన్నాం. ఇందువల్ల మాకు మరో లాభం కూడా చిక్కింది. అవసరానికి తెచ్చుకోడంవల్ల ధాన్యం ఆడించుకోవడమూ బియ్యం బాగుచేసుకోవడమూ మొదలైన కష్టాలు పోయాయి.

అలా అవసరానికి ఇచ్చేవాళ్ళు కదా అని మేం ఎన్నడూ ఎక్కువగా కొని తెచ్చేవాళ్ళం కాదు. మా అమ్మకు నీతిలో చాలా విశ్వాసం ఉంది. ఒకసారి నాకే ఆలోచన కలగ్గా "తప్పు కాదురా గాడిదా?" అని మందలించిన మనిషి.

ఇది బాగా యోగ్యుండడంవల్ల కాబోలు, ప్రత్యేకించి అవసరాన్ని గుర్తించి పండగల్లోనూ అప్పుడూ అడక్కుండానే పంపేవారు మా బంధువులు. ఇవికాక మేం కావాలని ఎక్కువై అడిగిన సమయాలు లేకపోలేదు. మాటకి ఆ మధ్య మా అక్కయ్యొచ్చి వాళ్ళ వూళ్ళో గుమాస్తాలతిండి గగ్గోలుగా ఉన్నా అన్యాయమనిపించే బియ్యం యిస్తున్నారన్న సమయంలో ఆరు కుంచాల బియ్యం నేను తెచ్చియిచ్చాను. మరోమాటు మా వేలువిడిచిన మేనమామ

పెళ్ళాం పిల్లల్తో సహా దిగి వారం రోజులున్నప్పుడు అందర్నీ వాళ్ళే భరించారు ఈమధ్యనే మా పరిక్షలైపోయి మేం ఎక్స్‌కర్షనుకి వెళ్ళేటప్పుడు డబ్బిచ్చి రెండు కుంచాల బియ్యం తెచ్చాము.

ఒకటి రెండుసార్లు బాబూ నేనూ కలిసి సినిమా కెళ్ళడానికి డబ్బులేక బియ్యం తెచ్చి అమ్మి వెళ్ళిన మాటా నిజమే.

తిన్నగా వెళ్ళి రెండుసేర్లబియ్యం సంచిలో పోసుకుని వెళ్ళినదారంటే వొచ్చాం. బాబు వాళ్ళింటిముందు సైకిలాపి, "మీరిక్కడుండండి. నే లోపలికెళ్ళొస్తాను" అని సంచి పట్టుకు రంగమ్మ గారింట్లో కెళ్ళాడు.

నేను సైకిలు పట్టుకుని అలా ఓ చక్కరుకొట్టి వద్దామని బయలుదేరాను. మళ్ళీ వొచ్చేసరికి బాబు వాళ్ళగుమ్మంలో నుంచుని ఉన్నాడు. తొందర పడుతున్నాడని ముఖం చెప్తోంది.

"ఏమిటి? కాయా, పండా?" అన్నాను.

"కాయెందుకవుతుంది? పండే!"

"ఎన్ని పళ్ళు?"

"మూడు... దీని తస్సాదియ్యా పావలా యిచ్చింది కాను. పదండి టైమైపోతోంది. మీరింకా హాస్కు కొడుతూ కూచున్నారు."

గోడ వాచీలోకి తొంగిచూశాను. అయిదు గంటలపైగా అయిపోయిందప్పుడే.

"ఉండు. ఇంటికెళ్ళొస్తాను" అంటూ సైకిలు తిప్పి వెళ్తున్నాను. ఇంతలో మా తమ్ముడు కనిపించాడు.

క్షణంలో నాకో ఆలోచన తట్టింది. ఇంటికెళ్ళి అమ్మని పెర్మిషన్ అడిగితే యివ్వవచ్చు కాదనవచ్చు. రెండోమాటు అడగడమూ అదీ కాలయాపన! అసలిప్పటికే మించిపోతోందాయిరి. అందుచేత, వీడితో చెప్పేసి పారిపోవడమే సర్వవిధాలా శ్రేయస్కరం!

"ఒరే చిన్నా, అమ్మతో నేను సినిమా కెళుతున్నానని చెప్పరా!" అంటూనే సైకిలు తిప్పాను.

"అమ్మ పిలుస్తోంది!"

"వొస్తాన్లే." అని వెళ్ళిపోతున్నాను. "ఒరే అన్నయ్యా," అంటున్నాడు గాని వినిపించుకోలేను.

ఇద్దరమూ సైకిలుమీద ముందు కాఫీ హోటలుకి వెళ్ళాం. సిగరెట్లకీ కాఫీ హోటలుకీ మొత్తం రూపాయిచ్చేశాం. సినిమాకి వెళ్ళి, మిగిలిన అర్ధరూపాయి పెట్టి స్వీటు కొనుక్కుని తింటూ యింటికొచ్చాం. సరిగ్గా పది గంటైంది రాత్రి.

అమ్మ తలుపు తీసింది.

ఇంట్లో అడుగు పెడుతూండగానే "ఏంరా నాయనా, పిలుస్తూండగానే వెళ్ళిపోయావుట?" అన్నది.

"టైమయిపోయిందమ్మా!"

"ఇంట్లో బియ్యంలేవు, అలా కొత్తపేట వెళ్ళి బియ్యం తెస్తావేమోనని కబురంపిస్తే సినిమా కెళుతున్నానని కబురంపావు."

విని వినిపించుకోనుండానే కాళ్ళు కడుక్కున్నాను.

"అన్నానికి పద."

పీటమీద కూచున్నాను.

"బియ్యమైపోయాయి. మధ్యాహ్నమే చెప్దామనుకున్నాను గాని మర్చిపోయాను. కాలేజి కెళ్ళి నీళ్ళు తెచ్చేలోపుగా వెళ్ళిపోయావు."

"మరెలా తెచ్చావు?" అన్నాను. మనస్ఫూర్తిగానూ, గుండెలో అమ్మ బాధను పంచుకుంటూనూ మాత్రం కాదు.

"బియ్యం ఎవరయినా అప్పిస్తారేమో అని బయలుదేరాను. ఎవరిస్తారు? అందరూ లేమ సింగల్లో యిబ్బంది పడుతున్నారు. పైగా శనివారం-యెవ్వరూ లేవంటే లేవన్నారు. చివరికి రంగమ్మగారింటి కెళ్ళాను."

నాకు గుండెల్లో ధైర్యంలేదు.

"ఆవిడా లేవంటూనే మొదలుపెట్టింది. ఇవాళే తేవని బాబుతో చెప్తే అతను సాయంత్రం సేరు రూపాయి పదణాల చొప్పున ఎక్కడో రెండు శేర్లు తెచ్చాట్ట..."

"రూపాయి పదణాలే?" మనసులోనూ పైనా అన్నాను.

"ఆఁ రూపాయి పదణాలట! వాళ్ళాయన అంత ధరపెట్టి కొంటావా అని గసిరారుట. అందులోనే కావలిస్తే ఓ శేరు కొనేసుకోమంది. అవేం లేవమ్మా, రేపు తెల్లారగానే కుర్రాణ్ణి పంపించి తెప్పించిస్తానమ్మా అప్పుగా

ఇమ్మన్నాను. అప్పు అంటే నావల్లగాదు, ఇవ్వనంది. చివరికి ఆ రూపాయి పదణాలే పెట్టి ఓ శేరు బియ్యం తెచ్చాను."

నా లోపలి యుద్ధం వర్ణించదగ్గది. రంగమ్మగారు రూపాయిన్నరకి కొని రూపాయి పదణాల కమ్మారు. ఇక్కడా నిజాయితీ కనపడదు- మా నిజాయితీ అటుంచగా.

"...చూడు నాయనా తెల్లారి బియ్యం యిస్తారు కోటా. కొత్తపేట వాళ్ళయినా రాత్రికి రాత్రి అడిగినా యిస్తారు; ఇలా వుండి కూడా శేరు అంత డబ్బు పెట్టి కొనడం కళ్ళమ్మట నీళ్లు కాదు నాయనా. కొరిందనుకో తెలిసిందా!"

అన్నం సయించమంటే ఏం సయిస్తుంది?

"పోనీ...ఏమైతే ఏంది. పొద్దున్నే అలా కొత్తపేట వెళ్ళి రెండుశేర్ల బియ్యం అడిగి పట్రా. ఇవాళ తెచ్చిన శేరు బియ్యంలోవి అర్థశేరు సీతారాముడుగారి కిచ్చెయ్యాలి."

"అంత తొందరా? రేపు మధ్యాన్నం ఇవ్వరాదూ?"

"నీ చేత తెప్పించుదామని, తప్పకుండా రేపు పొద్దుటే యిస్తానని చెప్పాను. ఆవిడ అప్పుడే అడిగింది కూడానూ, దీపాలుపెట్టాక"

'సరే అయితే నన్నేం చెయ్యమంటావ్ చెప్పు."

"ఏముంది? పొద్దుటే కొత్తపేట వెళ్లు. అట్నుంచొచ్చేక స్కూల్కు వెళుదువుగాని."

నాకేం తోచలేదని అమ్మ కనిపెట్టలేదు. నా లోపల మాత్రం సినిమా ఆడుతోంది.

# ప్రభుత్వం : మధ్యతరగతి కుటుంబాలు

"యాటం"

మద్రాసు ప్రభుత్వపు ఆర్థిక సలహాదారుని శాఖ మన మద్రాసు నగరంలోని మధ్యతరగతి కుటుంబాల జీవన పరిస్థితుల గురించి పరిశీలించుతుందని డిసెంబరు 26న ఒక పత్రికా ప్రకటన జరిగింది. దీనినిబట్టి మన మద్రాసు ప్రభుత్వంవారు మధ్యతరగతి ప్రజల స్థితిగతుల్ని విచారించడానికి యిప్పుడిప్పుడే కళ్లు తెరిచారన్నమాట! ఈ విషయం మధ్యతరగతి ప్రజలందరికీ ఆశారేఖగా కన్పించుతుంది. ప్రొఫెసరు సి. యస్. వకీలు ఒకసారి మధ్యతరగతి ప్రజల గురించి రాస్తూ "సామాజిక వ్యవస్థలో ప్రముఖస్థానాన్ని వహించిన మధ్యతరగతి ప్రజలు గత యుద్ధకాలంలోను, యుద్ధానంతరము బాగా నలిగిపోయారు. ఏ ఉద్యమానికైనా మధ్యతరగతి ప్రజలే నాయకత్వం వహించేది. కాని అటువంటివారి స్థితి నేడు హీనాతిహీనంగా వున్నదని" ఆయన వెల్లడించాడు. ఇదేవిధంగా డిసెంబరు చివరివారంలో పాట్నాలో సమావేశమైన 34వ అఖిలభారత ఆర్థిక శాస్త్రవేత్తల సంఘానికధ్యక్షుడుగా ఎన్నుకోబడిన డాక్టరు హెచ్. యల్. డే కూడా మధ్యతరగతి ప్రజలనుద్దేశించి యిలా పేర్కొన్నాడు: "ముఖ్యంగా మన దేశంలో వ్యాపారస్తులు, కార్మికులు, స్వయంగా సేద్యం చేసుకునే రైతులు జాతీయాదాయములో ఎక్కువ భాగాన్ని పొందగలిగారు. కాని మధ్యతరగతి ప్రజల ఆదాయాలు మాత్రం జీవనవ్యయ ప్రమాణానికి, ధరలస్థాయికి ఎంతో వెనుకబడివున్నాయి. సమాజంలో అతిముఖ్యాంగమైన మధ్యతరగతి ప్రజలు బాగా గట్టిదెబ్బ తిన్నారు. ద్రవ్యోల్బణపు ధరల వొత్తిడి మూలంగా జీవితపుస్థాయి సర్వనాశనమైపోయింది. అంతేకాదు. శారీరక మానసిక శక్తిసామర్థ్యాలు కూడా అడుగంటుతున్నాయి. అందరూ ముఖ్యంగా గమనింపదగ్గ విషయమేమిటంటే మధ్యతరగతి ప్రజల్లో సాంప్రదాయిక సిద్ధంగా వస్తున్న నైతికపు నిజాయితీ కూడా అదృశ్యమైపోతోంది" ఈ సందర్భంలో యీయనగారిచ్చే ముఖ్య సలహా